"గోషావాళ్ళు"

"కాని అంత బీదవాళ్ళం కాదుగా !"

"నాకేం ? అందరూ యాచకులే, మొగుళ్ళ దగ్గర."

"ఆ స్తివున్న స్త్రీ లెందరు ? ఎందరు బైటపడి కానీ సంపాదించ గలరు ?"

"మీ బట్ట మీదికాదు. మీ తిండి మీదికాదు" అన్నాను.

ఆమె వెళ్ళింది కోపంతో.

ఇంకా స్త్రీల వుద్యమంలో పనిచెయ్యడం కొంతవరకే fashion అయింది- మీటింగులూ కాన్ఫరెన్సులూ-కనక అంతవరకే పనిచేస్తారు వివేకవంతులందరూ. పూలదండలూ- అచ్చులో పేర్లూ-అదృష్టముంటే బొమ్మలూ !

★

హ త్యా వి చా ర ణ

మహాడివిజన్ పోలీసువాళ్ళందరమూ కిందనించి పైదాకా నల్లి మందు నిద్రపోతున్న ట్లున్నామని సూపరెంటునించి గూటింపులు తీవ్రంగా వొచ్చినరోజే "టోలుగేటు" పక్కన కొత్త మొండెమూ, గాడిబావిదగ్గిర తలా దొరికాయి. యింక యీకేసన్నా శ్రద్ధవహించి ఆచోకీ తియ్యకపోతే, "సస్పెన్షన్" దాకా వొస్తుందని మూడురోజులు నిద్రాహారాలు లేకుండా

తిరిగి దోషుల్ని గుర్తించాను; కాని వాళ్ళు నలుగురూ మాయమైనారు. ప్రచ్ఛన్న స్వరూపంలో వాళ్ళ జాడలు పసిపడుతో పల్నాటిసీమను పడ్డాను. వేళకు తిండిలేక, బళ్ళల్లోనూ, బసుల్లోనూ కునికిపాట్లుతప్ప నిద్రలేక, నా పాత స్నేహితుడు చలిజ్వరం మళ్ళీ కొంచెంగా పలక రించగా, చివరికి వాళ్ళ నందుకున్నాను. యింక వలవేసి వాళ్ళని పట్టాలి. పూర్తిగా అలిసిపోయినాను. విసుకు పుట్టింది. బతుకంటే ధైర్యం వచ్చింది. నా ఆరుగురుపిల్లలూ భార్యా తిండిలేక గిలగిలలాడడమూ, అందులో నలుగురు ఆడపిల్లలూ ఐదేసివేలు అర్పించమని కాళీ అవతారాల్లాగ నా గుండెలమీద కూచోడమూ, వీటివల్ల పస్తాయించాను గాని, లేకపోతే ఆ క్షణాన వెధవనౌకరీకి ఒక్క పెద్ద సలాము చెప్పి, మా పూర్వుల యాయవారం చెంబు నాశ్రయించి వుందును. నౌకరీల్లోకల్లా నీచమైన నౌకరీ పోలీసునౌకరీ.

రాత్రులు వూరివెలపల అడివిలో నాకు కావలసిన పెద్దమనుషులు నలుగురూ చేర్తారని తెలిసి, యీలవేస్తే అందేట్టు జవాన్లని దాక్కోమని చెప్పి, నేను గొంగడీ కప్పుకుని బైలుదేరాను. ఆ చలికాలపు సాయింత్రం, గుడిశవెనకనించి చింతతోపులో యెర్రగా కాలుతోంది పడమటిమూల. నే ననుకున్నట్టే తలుపు బిగించివుంది; దొంగదగ్గు దగ్గుతో వొణుకుతో రేగి పొదకింద మఠం వేశాను. ఆకాస్త వెలుతురూ మాయమయింది; చింతల్లోంచి పురుగులు కీచుమంటున్నాయి. గబ్బిలాలుగావును నల్లగా నలుపులో రెక్కలు కొట్టుకుంటో భూతాల్లాగు లేచిపోతున్నాయి. అక్క డక్కడ జరజరమని యెండుటాకులమీద అనుమానంగా పాకుతున్నాయి యేవో. యీల నోట్లో పెడితే పదిమంది యెములవంటి జవాన్లు వస్తారనే ధైర్యమే లేకపోతే, వాళ్లు నా పిరికితనానికి నవ్వుతారనే భయమే లేకపోతే, వెంటనే పరుగెత్తుదును భయంకరమైన ఆ చోటునించి. దూరంనించే పాట పాడుకొంటో నెత్తిన కడవ పెట్టుకుని ఒకామె వొచ్చింది. ఆ పాట వింటేనే నాకు భయంతో వొళ్ళు వొణికింది. చింతల చీకట్లో,

ఆకాశపు సంధ్య ఎరుపుల్లో, హత్యల రక్తంలో, క్రూరుల ముద్దుల్లో, నరబలుల పాపంలో నానింది ఆ గొంతు. కాని ఆ భయంలోనించి ఆనందం కలుగుతోంది. ఆ కంఠస్వరపులోతు. ఆ మాటల పటుత్వం, ధీరత్వం, నల్లని స్త్రీ నల్లనిచీర కట్టుకుని చింతనీడల చీకట్లో నుంచుని, ఆగి, నావంక తిరిగింది.

"యెవ్వరు ?"

యెంత ధైర్యం, పొగరుబోతుతనం ! మూలిగాను. దగ్గాను.

"యెవరు తాతా నువ్వు?"

"నేను తాతను కాను."

నవ్వింది యేం ధైర్యం ? ఆ గుడిశే నాదై, ఆ రేగిచెట్టుకింద చీకట్లో యెవరో దగ్గితే, కడవ పారేసి వెనక్కి విరుచుకుపడుదును నేనైతే.

"అంతా మోసమే !"

కనిపెట్టిందా యేమిటి ?

"జబ్బుగా వుంది."

"యేవూరు ?"

బొంకాను.

"యెవరు ?"

బొంకాను.

"యెక్కడికి వెడతావు ?"

"యెక్కడికేముంది, యింత ప్రపంచంలో."

"యిక్కడికే నన్నమాట !"

కనిపెట్టిందా ? బెదిరింపా ?

"చలి, చలి."

పళ్ళు పటపట మనిపించాను. కదవ దింపి తడిక పూడతీసి, దీపం వెలిగించింది.

"అక్కడే వుండు పిలిచిందాకా."

కడవలోంచి కల్లుకంపు కొడుతోంది గదిలో సద్దుతోంది.

"రా, తాతా."

"తాతని కానంటే !"

"రా, పడుచూ"

పకపకా నవ్వింది. చుట్టూ చింతలూ, నేపాళాలూ, చిటిరేగి పొదలూ, గుడ్లగూబలూ నవ్వాయి. గుడిశె నాలుగుపక్కలా చూశాను. ఒకమూల పొయ్యి, తాళ్ళు, నాలుగు గోనెలూ, గొంగళ్ళు, ఒక పెద్ద పెట్టి, మూడు కుండలూ-అంతే. యేమీ అనుమానాస్పదంగా లేదు. నన్నామె కళ్ళు పరీక్షించడం, 'ఫీ'లై, నే నామెవొంక తిరిగి చూశాను. ముప్ఫైయేళ్ళుంటాయి. వక్షము చాలా యెత్తు. అంతయెత్తు. బలుపూ, బిగువూ, ఐన రొమ్ముని నేనెప్పుడూ చూడలేదు. నడుము సన్నము. ఆమెనీ, ఆ గంద్రమొహాన్నీ, ఆగట్టి పెదవుల్నీ, మొహంమీదపడే జుట్టులో కనపడని కళ్ళనీ, ఆ వొంటి రంగుని చూస్తే, రాతిలో చెక్కిన విగ్రహం ప్రాణం ధరించి కదులుతోందనిపిస్తుంది. జుట్టులోనించి కళ్ళు కనపడకపోయినా చూపులు మాత్రంసూటిగా వాడిగా గుచ్చుకుంటాయి. ఆ భుజాల యెత్తూ, తొడల జవజవా,ఆ కంఠం గుంద్రతనమూ,ఆ వెంట్రుకల బిరుసూ,చూస్తే, పురాతనపు రాక్షసాంగనల ఆకర్షణ యిట్లా వుండేదేమో అనిపించింది. చప్పున నా కళ్ళనించి తిరిగి, పొయి వెలిగించి, దీపం గుమ్మం అవతలగా బైటపడుతో నా వంక చూసి, చిరునవ్వుతో 'పురుగులు' అంది, బైటదీపం లోపల కొత్తవాడున్నాడని తెలిపేందుకని నాకేం తెలుసు ?

పొయ్యిమంటలు గంతులేస్తున్నాయి. వాటికి తాళమేస్తో చీకట్లు గోడలమీద నాట్యమాడుతున్నాయి. బొద్దింకలు చెదిరి పరుగెత్తుతున్నాయి. బూజు కళ్ళమీదకి వేళ్ళాడుతోంది.

'తాతా, గంజి తాగుతావా ?' అంది బియ్యం కడుగుతో.

నవ్వుతోందా ?

'తాగను మరి ! సాయింత్రం నించి ఆకలిగా వుంది. పొద్దున్న ఆ కోమటి తల్లి పోసింది యింత చద్ది అంబలి అంతే.'

పొయ్యిమీద బియ్యంవేసి,

'యిప్పుడే వొస్తా కూచో' అని, చెంబూ నీళ్ళూ పట్టుకుని వెళ్ళింది. పొయి కెదురుగా కూచున్నాను. వొస్తారా వాళ్ళు? నేనున్నానని భయపడి వెనక్కి పోతారా ? యీ ఆడమనిషి వుంటుందనుకోలేదు; వాళ్ళే రావడం, యీలవేసి పట్టించడం అనుకున్నాను. కానీ !

పావుగంటలో వొచ్చింది. తలలో తెల్లని పూలేవో పెట్టింది. వాటి వాసనతో గుడిశ నిండింది. నల్లని బూజుపట్టిన మూకుడు పెట్టి దాంట్లోనే గంజిపోస్తోంది. మనసు పట్టలేక పోయినాను. పుట్టింది బ్రాహ్మణ పుట్టుక!

'అది కడుగుదూ !'

పక్కున నవ్వింది.

'అలవాటు లేదు గావున !' అని,

కడిగింది. యెంత ఆచారాలు వొదిలినా విస్తరి చుట్టూ నీళ్ళు చుట్టడం మానలేదు. చెయ్యన్నా కడుక్కోకుండా ఆ మూకుడులో మెతుకులు ఏరదామంటే. చెయ్యి సాగదు. కాని వొణికానా, సందేహించానా, యీ శ్రమంతా వృధే! ముక్కు మూసుకుని, మూకుడెత్తి ఔషధం మల్లే తాగాను.

'యేం తాతా, మాయ కోమటిదాని వుత్త అంబలే రుచిగా వున్నట్టుందే !'

నవ్వింది.

'యిది వేడిగా అన్నా వుంది.'

'మూతి కాలుస్తుంది. జాగ్రత్త. యింకొంచెం తాగుతావా ?'

'వొద్దు.'

కుండెడు గంజీ అవలీలగా లోపల పోసేసుకుంది.

'యీవాళ. పిట్టలు దొరకలేదు.'

'యెట్లా దొరుకుతాయి ?'

పైన చూపింది. గాండీవమంటిది విల్లుబద్ద వుంది.

'నన్ను తినాలని మృగమేదన్నా అప్పుడప్పుడీ గుడిశలో దూరుతుంది. నేను దాన్నే కోసుకుతింటాను.'

ఆ బెదిరింపుతో హడిలిపోయినాను.

నేను గుడిశ బైటికి పోయి చుట్టూ చూశాను. నా గుండె కొట్టుకుంటోంది. చప్పున అట్టా చీకట్లోకి పరిగెత్తుకుపోతే తోకజాడించి యీ గుడిశలో పడుకుని బైటికి రాగలనా ? కాని దోవ తెలీదు, యెక్కడికి పోను ? జవాన్లు వొచ్చి కాచుకుని వున్నారా? కాని వాళ్ల సహాయం అడుగుతానా? ఆడదానికి దడిసి పరిగెత్తి. యింక గౌరవం వుంటుందా? దైవాన్ని నమ్మి, నా ఉద్యోగాన్ని తిట్టుకుంటో కూచున్నాను. నా పక్కన వొచ్చి అది కూచుంది.

'తాతా, చుట్ట కాలుస్తావా ?'

తాత గానంటే యే మిస్తుందో ?

'అలవాటు లేదు.'

'పొడుం?'

'లేదు.'

'బీడి ?'

'ఉహూఁ.'

'తాంబూలం అలవా టనుకుంటా.'

నవ్వింది.

'నువ్వు వొక్కత్తెవూ వూరి బైట యిట్లా వొంటరిగా కాపర మున్నావేం ?'

'వూళ్ళో కుక్కల్ని చూస్తే నా కిష్టంలేదు.'

'కుక్కలూ !'

'రెండు కాళ్ళ కుక్కలు.'

'యెందుకా కోపం ?'

'కుక్కలు గనక.'

'నీకు పెళ్ళికాలా ?'

'అయింది.'

'ఏ డీ?'

'ఆకలేసి, తినేశాను.'

'తరవాత యేం తింటున్నావు ?'

'దోవపొయ్యేవాళ్ళని.'

నవ్వింది.

'నీకు పెళ్ళయిందా, తాతా !'

దగ్గిరిగా జరిగింది.

'పెళ్ళే నాకు!'

'కాలేదా ?'

'లేచి పోయింది.'

'ఐతే, యెట్లా, తాతా !'

'పిల్ల నిప్పిస్తావో.'

'పిల్లెందుకు నీకు ? నాయీడుదాన్ని కట్టుకో.'

'వుందా ?'

'వెతకడ మెందుకు ? నే నున్నానుగా ?'

'నువ్వే !'

'యేం ? నేను బావుండలా ?'

దగ్గిరిగా అనుకుని కూచుని, ఒక చెయ్యి నా మెడమీద, ఒక చెయ్యి నా వొళ్ళో జారనిచ్చింది.

'యీ అడివంతా మన రాజ్యం. నీకు రోజూ గంజి కాచిపెట్టి, యీ కడవలోది.... అబ్బో, తాతవు కావే ?' అని,

చప్పున దూరంగా జరిగింది. ఆమె స్పర్శతో నా వొళ్ళు పులక రించింది. మళ్ళా వొచ్చి యెదురుగా కూచుంది. పమిట నేలమీదికిజారింది, రెవిక పక్కలకి తొలిగింది. కళ్ళు తిప్పలేక, బలవంతంగా చూపుల్ని పైకి లాగుతో బాధపడుతున్న నా కళ్ళకేసి చూస్తో చంపల కింద చేతులేసుకుని కూచుంది. ప్రయత్నంతో నేను నా భార్యనీ, చిన్నమ్మాయి ముద్దుమాటల్నీ మా సూపరెంటు ముఖాన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూన్నాను, లేచి.

'పడుకుందాం రా. తాతా, పొద్దుపోయింది' అంది.

గుడిశలో మూల గొంగళీ నా కిచ్చింది. తడికదగ్గిరిగా తను పరుచు కొంది.

'యిటు వేపు దొల్లకేం, ఆడదాన్ని చేసి, నీ సంగతి నాకు తెలుసు'

నేను మాట్లాడలేదు. నా కాశ్చర్యం యెక్కువౌతోంది. నిద్ర మాత్రం పోకూడదు. కళ్ళు మూశాను. మళ్ళీ యెక్కడో కళ్ళు తెరవడం. పడుకున్నాను యెంతోసేపు చీకట్లో చూస్తో. అప్రయత్నంగా కునుకు పట్టింది గావును. మెల్లిగా చెయ్యి నా గొంగడి కిందికి దూరడం నన్ను లేపింది. చప్పున చెయ్యిపట్టుకున్నాను.

'నేనే తాతా.'

'ఐతే, యేమిటిది ?' అని బిగ్గరగా కేకేశాను.

'అమ్మ, తాతవుకాదే. చెయ్యి విరిచేశావు.'

నా పక్కన పడుకుని దగ్గిరిగా జరిగింది. నాపైన బలువుగా ఒక కాలూ చెయ్యీ వేసింది.

'తాతా, నన్ను పెళ్ళాడరాదూ?'

నవ్వింది, ఆ నవ్వు నా నరాల్ని లాగుతోంది.

'సరే, రే పొద్దున్న కద!'

'కాదు, యిప్పుడే. అందాకా వుండగలనా ?'

యెందు కాచెయ్యని మళ్ళీ గొంగడీ కిందికి పోనిస్తోంది ? ఆమె పెదిమలు నా పెదిమల్ని నొక్కుతున్నాయి. జవాబు చెప్పడానికి వీల్లేకుండా నా పైకి బాగా వంగి ఒక చేత్తో చేతిమీదిగా మెడకిందికి పట్టుకుని, బలమంతా నా మీద అనించి రెండో చేత్తో గొంగట్లో వెతుకుతోంది. ఆమె జుట్టు నా మొహాన్ని కప్పింది. ఆ అడవి పువ్వులు ఘుమ్ముమన్నాయి. కల్లుతో నిండిన శ్వాశ నా మొహాన్ని ముక్కుల్ని కప్పేసింది. ఆమెని కావలించుకోడానికి నా చెయ్యి పైకి లాక్కోపోయినాను. కాని గట్టిగా రొమ్ముతో అదుముతో రానీలేదు. బావుంది, యెంతో సౌఖ్యంగా వుంది. కదలకుండా పడుకున్నాను. కాని ఆమె చెయ్యి, మెల్లిగా పాములాగు

జరుగుతోంది. వెతుకుతోంది. జారబడుతోంది. నా వళ్లు ఝల్లు ఝల్లు మని ఆమె వేళ్ళకింద వొణుకుతోంది. కాని మొగాణ్ణి. స్వేచ్ఛ లేకుండా ఆమె చేతులమధ్య చిక్క....

'నిన్ను చూడగానే, నీ దొంగదగ్గుని, నీ పెద్ద ఛాతీని, నీ పెద్ద మీసాల్ని, నీ మాయ వొణుకుని....నాకు నీ మీద యెంత మనసు కలిగింది ! యింక వెళ్ళవొద్దు. ఒంటరిదాన్ని యీ కారడివిలో! పగలూ రాత్రీ యెప్పుడూ యిట్లా—'

యింక వినరాని మాటలు, నా రక్తం పొంగించే మాటలు. చెవులు మూసుకోవా లనుకుంటో చెవులు విప్పి వినే ఆ మాటలు, మొగవాడి అహంభావాన్ని హెచ్చించే మాటలు, జన్మ సార్థకమయిం దనుకునే మాటలు ముద్దుగా రహస్యంగా మాట్లాడింది. కాని ఆ చెయ్యి— తీసేస్తోంది. వొదిలించుకుంటోంది. యేమిటా చల్లగా ? నా గుండెలు కొట్టుకోడం ఆగాయి. బాబోయి నా రివాల్వరు లాగేసింది! చప్పున నా బలమంతటి తోనూ తిరగబడ్డాను. కలియబడ్డాను. వొదులుతున్న చేతుల్ని పట్టుకున్నాను. దాని బుజాలు పట్టుకుని వొంచాను. కాని పాములాగు, చుంచులాగు, నున్నగా జారింది, తప్పించుకుంది. దాంట్లో గుళ్లున్నాయి. పేలితే! నా మీదే పేలితే! వెతికి ఒక చెయ్యి పట్టుకున్నాను. యింక మల్ల యుద్ధ మయింది. యెట్లానైతేనేం ఆమెని కిందచేసి నేను పైన కూచున్నాను. చేతు లందనీదు. కోపమొచ్చి కొట్టాను. కొరికింది. యిద్దరి శ్వాసలూ, గుడిశలో ఆ తోపు నిశ్శబ్దంలో గంభీరంగా వినపడుతున్నాయి. యెంతసేపు పెనుగులాడామో! టుపాకి పేలితే యెంతసేపు! దొంగముండ ! గొంతు నొక్కాను. చంపెయ్యాలనే ! మొగాణ్ణి ! దీన్ని గెలవలేనూ ! యెంత బలముంటేనేం ? ఆడది గెలవగలదా ? చప్పున పట్టు వొదిలింది. చేతులూ మెడా వేళాడేసింది. చచ్చిందా ! మూర్ఛా ! ముందు రివాల్వరేదీ ! మీద కూచుని చేతులు వెతికాను. లేదు. రెవిక విప్పి వెతికాను. యేదీ ! కోపంతో

చీరె వూడతీసి పారేశాను. లేదు. నేను చేస్తున్నపని చూసి, కొంచెం కాలం కిందటి సంగతి జ్ఞాపకం వొచ్చి నవ్వొచ్చింది. గుండెలమీద చెయ్యేశాను. కొట్టుకుంటున్నాయి. స్పర్శ నా సుఖంతో చెయ్యి అక్కడే ఆగింది. వెచ్చగా ఆ గట్టిచర్మం! కావిలించుకుంటే. కాని రివాల్వరు. ఒక్క వూపు వూపింది. కింద పడ్డాను. చప్పున లేచింది. దూరంగా వెళ్ళి పక్కన గుడిశ మారుమోగేట్టు నవ్వింది.

చప్పున దూకాను. పెద్ద కొయ్యతో నా తలమీద దెబ్బపడ్డది.

'యీసారి దొంగల్ని పట్టుకోడానికి వచ్చినప్పుడు రివాల్వరు సరిగా దాచుకో. వేసింది తాతవేషం, మాట్లాడేది బ్రాహ్మణమాట!'

చప్పున యీలతీసి వూదాను. తలమీద యింకోదెబ్బ పడ్డది. కింద పడ్డాను....

ఆస్పత్రిలో కళ్లు తెరిచాను.

'యేమయింది?'

'యెవరూ?'

'అదీ !'

'యేదీ?'

'ఆ మనిషి'

'యేవరూ లేరే!'

'ఆ గుడిశలో యేం దొరకలా?'

'ఒక చీరా, రెవికా.'

★